# పరిమళ నవ్వింది

'మయూర్'



ఏనిమిది నెంబరు బస్సు దిగి నడు స్తున్నాను. టాంకు బండు మీద బస్సులు రొదచేస్తూ పోతున్నాయి. ఆలోచనా ప్రవాహం గంతులు వేస్తూ ముందుకు పోతూంది. మెల్లగా మెట్లుదిగి దోమల్ గూడాలోకి వచ్చాను. హైదరాబాద్‌లో మనుష్యుల జీవితాలు యాంత్రికంగా నడుస్తూంటాయి అంటారు. నేను యాంత్రికంగానే వున్నాను. మళ్ళీ ఎలక్ట్రిక్ షాకు వచ్చింది.

'పరిమళ, మా ఇంటికి వస్తుందట'

'వస్తే భయమేమిటి?'

'వస్తే మా ఇంటిని, అలంకరణను, ముఖ్యంగా మా శ్రీమతిని చూస్తుంది.'

'చూస్తే ఏమిటి?'

'నన్ను హేళన చేస్తుంది.'

'ఏందుకు? తనకు మాత్రం 'కల్చర్' లేదా?'

'ఉంది, కాని నేను ఆవిడకు ఏమేమో చెప్పానే అవన్నీ అబద్ధాలని తెలిసి పోవూ?'

'అవును. ఆరోజు పరిమళ నన్ను వాళ్ల ఇంటికి కాఫీకి పిల్చింది. ఇద్దరం కాలేజీ లెక్చరర్లమే కనుక మా భావాలు కొంత వరకు ఏకమయ్యాయి. సిటీలో సింపుల్‌గా వుండాలను కొన్నాం ఇల్లు అందంగ అమర్చితే బాగుంటుంది భార్యా భర్తలు ఇద్దరు చదువుకొన్న వాళ్ళయితే ఒకరినొకరు అర్థం చేసుకుంటూ చిలకా గోరింకల్లా సంసారం చేస్తారు ఇంకా భర్తకు కావలసిన క్లాసునోట్సు భార్య తయారు చేయవచ్చు. భర్త భార్యకు వంటలో సహాయ పడవచ్చు. (ముఖ్యంగా భర్త కెమిస్ట్రీ లెక్చరర్ అయితే మంచిది.) ఒకరికి కావలసిన టెర్మ్స్ మరొకరు సెలెక్ట్ చేసుకోవచ్చు

వాళ్ల ఇంటిని, మరి పరిమళను, ఆమె భర్తను అంతా పొగడారు. దాంతో వూరుకోకుండా మా ఇంటికి రమ్మని ఆహ్వానించాను. భార్య బి. ఎస్ సి పాస యిందని ఉద్యోగం చేయడం తన కిష్టం లేదని చెప్పాను

మూడో వీధిలో మూడో ఇంటి కెళ్ళి తలుపు గొళ్ళెం టక్కు టక్కుమని కొట్టాను. దర్వాజా తెర్చుకొంది. శ్రీమతి దర్శనము అయింది. సుగుణ నవ్వింది. వణు కెక్కువయింది

పరిమళను పిల్చానంటేనే శ్రీమతి ఏమంటుందో? మనసు వెల్లకిలా బడింది. శ్రీమతిని చూచి పరిమళ ఏమంటుందో? ఎలాగో కాఫీ త్రాగుతూ శ్రీమతి చెవిని వేశాను. 'పరిమళ అనబడే ఒక సహ ఉద్యోగిని మన ఇంటికి రేపు సాయంత్రం అయిదు గంటలకు కాఫీకి వస్తుంది.' కాని విచిత్రం శ్రీమతి నవ్వింది. పైగా 'రానివ్వండి' అంది. అదే చిత్రం.

నా బాధ తనకేం తెల్సు. నేనే చెప్ప దల్చాను చెప్పాను నీవు సాధ్యమైనంతవరకు ముభావంగా వుండు. అట్టే ప్రసంగించక.

అడిగిన దానికి ముక్తసరిగ జవాబియ్యి పెళ్ళి చీర ఏదయినా కట్టుకో

*　*　*

సాయంత్రం అయిదయింది పరిమళ వచ్చింది భర్త రాలేదు. ఆఫీసు నుండి రాలే దట టైము తప్పకూడదని తను వచ్చే సిందట మనసులో అనుకొన్నాను, ఇంటికి వస్తే కుర్చీలో కూచో పెడదామని. శ్రీమతి వంట ఇంట్లో నుండి వూడిబడింది రేగిన తల, మాసిన చీర, చెరిగిన బొట్టు. పరిచయం చేద్దామను కొంటూంటేనే చాప వేసింది. 'రా, కూచో' అని ఆహ్వానించింది. ఏమిటో ఆ సంబోధన.

కుర్చీలు నన్ను చూచి నవ్వాయి.

'పోనీ నన్ను కూచో విస్తారేమో' అను కొన్నంతలోపే పరిమళకు వినపడేలాగే, బజారెళ్ళి పండ్లు తమలపాకులు తెమ్మని ఆజ్ఞాపించింది. గట్టిగా తిట్టాలనిపించింది. కాని 'కల్చర్' అనేమాట గుర్తుకొచ్చింది. వెళ్తూ పరిమళను ఒకసారి పలుకరించి వెళ్దామను కొన్నాను.

'పరిమళ నవ్వింది' నవ్వు కర్థం ఎంత వారైనా భార్యకు దాసులే అనిపించింది.

పండ్లు, పూలు, తమలపాకులు తెచ్చాను. పళ్ళెంలో అమర్చాను.

'ఇక మీరు వెళ్ళి ఆఫీసు గదిలో విశ్ర మించండి' ఉత్తర్వు.

'పరిమళ యీసారి గట్టిగానే నవ్వింది' కారణం బహుశః తను భార్యకు సమాధానం చెప్పలేకపోతున్నానేమోనని.

పరిమళ తాంబూలం పుచ్చుకొని శ్రీమ తితో వస్తానని చెప్పి నాకు నమస్కారం చేసి వెళ్తానని చెప్పింది. అంతే కాకుండా నన్ను చూచి మళ్ళీ నవ్వింది.

*　*　*

పరిమళ వెళ్ళింది.

కాలేజీలో ఎడతెగని నవ్వుతో చెప్పేసింది. సుగుణ తను ఒకేపూళ్ళో ఒకే స్కూల్లో ఫోర్తు ఫారం చదివారట తర్వాత సుగుణ చదువు మానేసింది. పరిమళ వాళ్ళు హైదరాబాదులో స్థిరపడిపోయారు. ఇప్పు డేం చేయాలి, నేను నవ్వేశాను. ●

# ఆంధ్రసచిత్రవారపత్రిక

## 1966 దీపావళి కథల పోటీ

ఎప్పటివలే ఈ సంవత్సరం కూడా 'ఆంధ్ర సచిత్ర వారపత్రిక దీపావళి కథల పోటీ' నిర్వహించపోతున్నదని తెలుపటానికి సంతో షిస్తున్నాము. కథకులందరూ ఎప్పటివలే మాతో సహకరించి ఈ పోటీని జయప్రదం చెయ్యగలరని ఆశిస్తున్నాము.

# మొదటి బహుమతి రు. 1100

# రెండవ బహుమతి రు. 750

# మూడవ బహుమతి రు. 500

## నిబంధనలు

1 కథలు స్వంత రచనలయి ఉండాలి ప్రతి కథతోనూ రచయిత అది తన స్వంత రచనేనని, దేనికీ అనువాదంకాని, అనుసరణకాని కాదనీ హామీరాసి పంపాలి. ఈ హామీ వేరే కాగితంమీద కాక కథ వ్రాతప్రతిమీదనే రాసిఉండాలి

2 కథలు తెలుగువారి జీవితానికి సంబంధించి ఉండాలి.

3 వ్రాత ప్రతిమీద 'దీపావళి కథల పోటీకి' అని స్పష్టంగా రాయాలి. కాగితానికి ఒకవైపు మాత్రమే సిరాతో రాయాలి రచయిత పేరు, పూర్తి చిరునామా కూడా వ్రాత ప్రతి మీద స్పష్టంగా రాయాలి రచనలు 12 అరఠావు (ఎక్సర్సయిజు నోట్‌బుక్ పేజికి రెండురెట్లు) పేజిలకు మించరాదు.

4 కవరుమీద ''దీపావళి కథల పోటీకి'' అని స్పష్టంగా రాయాలి. పోటీకి రచనలు 'సంపాద కుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, 7, తంబుచెట్టివీధి, మద్రాసు—1' కి పంపాలి

5 పోటీ గడువు తేది 30—9—1966 ఆ తేదీ తర్వాత మా కార్యాలయం చేరిన కథలని మామూలుగా ప్రచురణకి పరిశీలిస్తాము

6. పోటీలో బహుమతి పొందిన కథలని 'దీపావళి ప్రత్యేక సంచిక'గా 11—11—1966తేది కల ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురిస్తాము

7 పోటీ తుది నిర్ణయం ఆంధ్ర సచిత్ర వారపత్రిక సంపాదకుడిదే. ఈ విషయమయి ఎటు వంటి ఉత్తర ప్రత్యుత్తరాలూ జరపటానికి వీలులేదు

8 వ్రాతప్రతులని ఎటువంటి సందర్భంలోనూ తిప్పి పంపటానికి సాధ్యంకాదు.పోటీలో పాల్గొనే వారు తమ రచనలతో తపాలా బిళ్లలు అతికించిన స్వంత చిరునామాకల కవర్లు పంపనవ సరంలేదు

9. పోటీలో బహుమతి పొందక మామూలుగా ప్రచురణకి స్వీకరించిన కథల రచయితలకి ఆవిషయం ప్రచురించేముందు తెలుపుతాము.